సాక్షి
నిజామాబాద్
శనివారం । 10 । ఆగస్టు । 2024



ఘనంగా ఆదివాసీ దినోత్సవం

జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుమురం భీమ్‌కు నివాళులు అర్పించారు.

- 9లో ▸



ఆలయాలే టార్గెట్..

రుద్రూర్ మండల కేంద్రంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఆలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.3 /24.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



నిజామాబాద్ నాగారం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నిజామాబాద్ నగరంలో కొనసాగుతున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మున్సిపల్ కమిషనర్ మకరందుతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. మొక్కలు నాటి నీళ్లు పోశారు. డీసీ రాజేంద్రకుమార్, ఈఈ మురళిమోహన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలి



బోధన్‌టౌన్: బోధన్ బల్దియాకు ఇచ్చిన లక్ష్యం మేరకు 1.45 లక్షల మొక్కలను సకాలంలో నాటాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. బల్దియా పరిధిలోని వాటర్ వర్క్స్, డంపింగ్ యార్డు, యాదాద్రి పార్కు, బస్తీ దవాఖానాను పరిశీలించారు. 25వ వార్డులో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించారు. వాటర్ వర్క్స్‌లోని నీటి శుద్ధి చేసే విధానం గురించి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులో వర్మి కంపోస్టు తయారీ, డీఆర్‌సీసీ, బయోమైనింగ్‌లను తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఏఈ శ్రీనివాస్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జయరాజ్ పాల్గొన్నారు.

సిరికొండ సొసైటీలో విచారణ వాయిదా



సిరికొండ: సిరికొండ సొసైటీలో అక్రమాలపై చేపట్టిన విచారణ వాయిదా పడింది. సొసైటీలో గతంలో పని చేసిన సీఈవోలు, ప్రస్తుత సీఈవో, సిబ్బంది అక్రమాలపై విచారణ జరిపించాలని పాలకవర్గ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ అధికారిగా సూపరింటెండెంట్ పోశన్న, సిబ్బంది ఆనంద్ శుక్రవారం కార్యాలయానికి వచ్చారు. పాలకవర్గ సభ్యులపై కూడా ఫిర్యాదు వచ్చిందని చైర్మన్ గంగాధర్, వైస్ చైర్మన్ నర్సయ్య, డైరెక్టర్లకు విచారణ అధికారులు నోటీసులు జారీ చేయబోయారు. దీంతో వారిపై పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఈవో లేకుండా విచారణ ఎలా చేస్తారని, అధికారులు సిబ్బందికి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. దీంతో వారిమధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తప్పు చేసిన వారిని వదిలేసి, తమపై విచారణ చేయడం ఏంటని ప్రశ్నించారు. సీఈవో, మాజీ సీఈవోలకు నోటీసులు జారీ చేసిన అనంతరం మళ్లీ విచారణ చేపడుతామని అధికారులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా మూడు వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 50 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 502 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌లోకి 3,883 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సమానంగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు)అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి 1080.80(47.25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

డిప్యూటీ సూపరింటెండెంట్ల నియామకం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ముగ్గురు డిప్యూటీ సూపరింటెండెంట్‌లను నియమిస్తూ జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకే డాక్టర్లు వీపీ రావు, బాల్‌రాజ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా ఫిజియోథెరపి అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రదీప్, ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు సతీష్, సంతోష్‌రెడ్డిని నియమించారు.



కార్పొరేషన్ ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి నరేందర్ ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు, సోఫాలో నరేందర్

ఎరకు చిక్కింది
చిన్న చేపనే..!



పట్టుబడిన రూ.2.93 కోట్లు

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అవినీతి అక్రమాలకు అడ్డాగా మారింది. తాజాగా కార్పొరేషన్ ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి దాసరి నరేందర్ ఏసీబీకి చిక్కడం, భారీ ఎత్తున నగదు పట్టుబడడం నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. బిల్డింగ్ పర్మిషన్స్ నుంచి మ్యుటేషన్ల వరకు వసూళ్ల వ్యవహారంపై బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.



దాసరి నరేందర్

- 'సొర ' దొరకాల్సి ఉంది
- అవినీతిమయంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
- తాజాగా రెవెన్యూ ఇన్‌చార్జి అధికారి నరేందర్ ఇళ్లపై ఏసీబీ దాడులు
- రూ.6.7 కోట్ల విలువైన నగదు, ఆస్తులు స్వాధీనం
- అవినీతి, అక్రమాలపై 'సాక్షి'లో గతంలో వరుస కథనాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలకు హద్దు లేకుండా పోయింది. తాజాగా సూపరింటెండెంట్, ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న దాసరి నరేందర్ ఇళ్లలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఏసీబీ అధికారుల బృందం సోదాలు చేసింది. ఈ తనిఖీల్లో విస్తుపోయే రీతిలో నగదు, బంగారం, ఆస్తులు లభ్యమయ్యాయి. నరేందర్ ఇంట్లో ఏకంగా రూ.6,07,81,000 విలువైన నగదు, ఆస్తుల పత్రాలను అవినీతి నిరోధక శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నరేందర్ ఇంట్లో రూ.2,93,81,000 నగదు, అతని భార్య, తల్లి బ్యాంకు ఖాతాల్లో రూ.1.10 కోట్ల నిల్వలున్న పాస్‌బుక్‌లు, 51 తులాల బంగారం, రూ.1.98 కోట్ల విలువైన స్థిరాస్తి పత్రాలు లభించాయి. ఈ నేపథ్యంలో ఇందూరు నగరంలో ఈ విషయమై అనేక రకాల చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌లోని అవినీతి అక్రమ వ్యవహారాల్లో ఏసీబీ ఎరకు కేవలం చిన్న చేప మాత్రమే దొరికిందని, అసలైన సొర చేప చిక్కాల్సి ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

'సాక్షి'లో వరుస కథనాలు

నిజామాబాద్ కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమ వ్యవహారాలు, అస్తవ్యస్త పాలనపై, ప్రభుత్వ ఫీజులకు గండి కొట్టే తీరుపై, ఒక్క ఐడీపై అనేక దరఖాస్తులు, దరఖాస్తుదారులతో దొంగాటలు టీఎస్ బీపాస్‌లో అవకతవకలపై వరుస కథనాలు 'సాక్షి'లో ప్రచురితమయ్యాయి. ఈ కథనాలను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. ఇక కార్పొరేషన్‌లోని అవినీతి, అక్రమాలలో పరాకాష్టకు చేరిన పెద్ద తిమింగలాన్ని సైతం పట్టుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి. నరేందర్‌ను అడ్డం పెట్టుకుని ఒక కీలక అధికారి విచ్చలవిడిగా దండుకున్నట్లు పలువురు చెబుతున్నారు. ఈ క్రమంలో నరేందర్ సైతం విచ్చలవిడిగా వసూళ్లు చేశాడు. నరేందర్ అక్రమాస్తులే ఈ స్థాయిలో ఉంటే సదరు పెద్ద తిమింగలం ఆస్తులు ఏ స్థాయిలో ఉన్నాయో అని మాట్లాడుకుంటున్నారు. ఫైళ్ల కదలికకు సంబంధించి అంతా ఓటీపీ మాయాజాలం అంటూ చర్చలు జరుగుతున్నాయి. బిల్డింగ్ పర్మిషన్స్ నుంచి మ్యుటేషన్ల వరకు అన్నింటా భారీగా వసూళ్లే లక్ష్యంగా మున్సిపల్ కార్పొరేషన్‌ను దోపిడీ కి అడ్డాగా మార్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నరేందర్ బినామీలను ఏర్పాటు చేసుకుని ఆస్తులు కూడబెట్టినట్లు సమాచారం. ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లను, మరో ఇద్దరు ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్స్‌ను, ఒక ప్రైవేటు డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకుని వసూళ్ల దందాకు పాల్పడినట్లు తెలుస్తోంది. పైగా నగరంలో ఒక మెడికల్ ఏజెన్సీ, నాలుగు ప్రైవేటు ఆస్పత్రుల్లో వాటాలు ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. బినామీల పేరిట అనేక ఆస్తులు పెట్టినట్లు ఆరోపణ లు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి ఇతనిపై గుర్రుగా ఉన్న కాంగ్రెస్ నాయకులు కొందరు నరేందర్ వ్యవహారాలపై నిఘా పెట్టి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఏళ్లతరబడి ఇక్కడే పనిచేస్తున్న నరేందర్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా శోధించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేయాలని, అదేవిధంగా బడా తిమింగలాన్ని సైతం పట్టుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.



పట్టుబడిన నగలు



కార్పొరేషన్‌లో అక్రమాలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు

డీసీఎంఎస్‌ను బలోపేతం చేయాలి



ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తారాచంద్, పక్కన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తారాచంద్
- రైతులకు ఎరువులు, విత్తనాలు అందేలా కృషి చేస్తాం

సుభాష్‌నగర్: ఇందూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) కార్యకలాపాలను చైర్మన్ తారాచంద్ నాయక్ విస్తృతపర్చి మరింత బలోపేతం చేస్తారనే విశ్వాసముందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం నగరంలోని ఐడీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ తారాచంద్ నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ డీసీఎంఎస్ చైర్మన్ పదవి నిజామాబాద్ రూరల్ ప్రాంతానికి రావడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. తనకు పదవి ఇప్పించిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌తోపాటు ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. రైతులకు ఎరువులు, రుణాలు, విత్తనాలు సకాలంలో అందించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్ బీన్ హందాన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నాయకులు భూమారెడ్డి, బాగారెడ్డి, ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, కెతావత్ యాదగిరి, ఎల్లయ్య, పోలసాని శ్రీనివాస్, గంగాధర్, అంబర్ సింగ్ పాల్గొన్నారు.

నగరంలోని తిలక్‌గార్డెన్‌లో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



ఘనంగా నాగుల పంచమి

జిల్లాలో నాగుల పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పుట్టలో పాలు పోసి, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు తమ సోదరుల కళ్లు కడిగారు.

- 9లో..

ఆదిలాబాద్, హైదరాబాద్‌కు సెమీ డీలక్స్ బస్సులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి నిర్మల్, ఆదిలాబాద్, మెదక్ మీదుగా జూబ్లీ బస్టాండ్ వరకు సెమీ డీలక్స్ బస్సులను నడుపుతున్నట్లు ఆర్ఎం జానీ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ బస్సులు నిజామాబాద్ నుంచి ఉదయం 6:00, 9:45 బయలు దేరుతాయి. జేబీఎస్‌కు ఉదయం 6:30, 8:00 గంటలకు బస్సులు ఉంటాయి. నిర్మల్‌కు ఉదయం 7:50, 8:50, 11:15, మధ్యాహ్నం 12:15, 3:00, సాయంత్రం 4:00 గంటలకు బస్సులు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

అందని 'ఉపాధి' కూలి



మోర్తాడ్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- మే నుంచి జమ చేయని కేంద్ర ప్రభుత్వం
- జిల్లాలో బకాయిలు రూ.45 కోట్లు

మోర్తాడ్: ఉపాధి హామీ కూలీలకు సకాలంలో కూలి జమ కావడం లేదు. మే 19 నుంచి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కుటుంబ పోషణకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలకు రూ.45 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెగ్యులర్‌గా నిధులు విడుదల చేసిన ప్రభుత్వం ఎన్నికలు ముగిసిన తర్వాత నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు సాగుతున్నాయి. మే, జూన్ నెలల్లో రోజుకు 75వేల నుంచి 1.50లక్షల మంది కూలీలు పనులకు హాజరు అయ్యారు. జూలైతో పాటు ఈనెలలో వన మహోత్సవ కార్యక్రమంలో కూలీలు పనులు చేశారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ఒక వారంలో పని చేసిన కూలీలకు మరో వారంలో చెల్లింపులు చేయాలి. పది రోజులకు మించి ఎక్కువ ఆలస్యమైతే కూలీలకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఉపాధి కూలీలకు కూలి సొమ్మును చెల్లించడానికి నిధులను బడ్జెట్‌లో కేటాయించినా ఆ సొమ్ము విడుదల చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. కూలి సొమ్ము చేతికి అందుతుందనే ఆశతోనే ఎంతో మంది ఉపాధి హామీ పనులకు హాజరు అవుతున్నారు. కేంద్రం మాత్రం సొమ్ము చెల్లించకుండా తీవ్ర జాప్యం చేస్తుండటంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయాలని కూలీలు కోరుతున్నారు.

త్వరలో జమ అవుతుంది

ఉపాధి కూలీలకు మే 19 నుంచి కూలి జమ కావాల్సి ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి విన్నవించాం. నిధులు విడుదల చేస్తున్నారు. త్వరలోనే కూలి సొమ్మును జమ చేస్తారు. - సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

పెట్టుబడి సాయం లేనట్లేనా?

- ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా అందని రైతు భరోసా
- విధివిధానాలు ఖరారు చేయని ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న రైతులు



మోర్తాడ్: వానాకాలం సీజన్ ఆరంభమై రెండు నెలలు గడుస్తున్నా రైతులకు పెట్టుబడి సాయం అందించడంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.7,500 చొప్పున రైతు భరోసా అందిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. గత యాసంగి సీజన్‌లో పాత పద్ధతిలోనే ఎకరానికి రూ.ఐదు వేల చొప్పున సాయం అందించారు. వర్షాకాలం సీజన్‌లో మార్పులు చేసి సాగు చేసే భూములను లెక్కించి సాయం అందిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అలాగే బడ్జెట్ సమావేశాల్లో చర్చించి ఎన్ని ఎకరాల వరకు రైతుభరోసా అందించాలనే నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వ పెద్దలు వెల్లడించారు. శాసన సభ సమావేశాలు ముగిసిపోయినా పెట్టుబడి సాయంపై ఎలాంటి స్పందన లేదు. గతంలో జిల్లాలో 2,73,595 మంది రైతులు, 4,42,882 ఎకరాలకు రూ.271.44 కోట్ల సాయం అందించేవారు. గతంలో ఎన్ని ఎకరాలు ఉన్నా రైతుబంధు అందించారు. తాము మాత్రం పక్కాగా వ్యవసాయ భూములు అందులోను పరిమితిని విధించి రైతు భరోసా అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఇప్పటి వరకు రైతుభరోసా అంశంపై ఎలాంటి చర్చ లేకపోయింది. రుణమాఫీ రెండో విడత అమలు చేయగా, మూడో విడత మాఫీ సొమ్ము కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. రైతుభరోసాపై ప్రభుత్వం ప్రకటిస్తే తప్ప తాము ఏమి చేయలేమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు, ట్రాక్టర్ల అద్దె కోసం ఇప్పటి వరకు ఖర్చు చేసినా కలుపు ఇతర పనుల కోసం డబ్బులు అవసరమని రైతులు అంటున్నారు. పెట్టుబడి సాయం త్వరగా అందించాలని కోరుతున్నారు.

మాట తప్పడం సరికాదు



పెట్టుబడి సాయంపై ప్రభుత్వం మాట తప్పడం సరికాదు. అన్నదాతలు ఎన్నో కష్టాలకు ఓర్చి పంటలను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో పెట్టుబడి సాయం అందించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది.

– ఏనుగు రాజేశ్వర్, రైతు, మోర్తాడ్

నిధులు విడుదల చేయాలి



రైతు భరోసా కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.7500 చొప్పున ఈ సీజన్ నుంచే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. చిన్న సన్నకారు రైతులు ఎంతో మంది సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

– కౌడ లింబాద్రి, రైతు, తొర్తి

వరద కాలువకు జలకళ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి నిర్మించిన వరద కాలువ జలకళ సంతరించుకుంది. దీంతో కాలువలో పంపుసెట్ల ఆధారంగా సాగు చేసుకునే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం నుంచి నీటిని రివర్స్ పంపింగ్ చేయడంతో గతేడాది వరద కాలువ నీటితో నిండుగా ఉంది. ఈ సీజన్‌లో రివర్స్ పంపింగ్ చేపట్టకపోవడంతో కాలువ ఇన్నిరోజులు నీరు లేక వెలవెలబోయింది. కానీ 15 రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద నీరు కాలువలోకి వచ్చి చేరింది. బాల్కొండ పెద్ద చెరువు నుంచి వచ్చే అలుగు నీరు కాలువలోకి వచ్చి చేరుతుంది. అలాగే బోదేపల్లి వద్ద, కిసాన్‌నగర్ వద్ద వరద కాలువలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. దీంతో కాలువ నీటితో కళకళలాడుతోంది.

ఆయకట్టు 13 వేల ఎకరాలు

వరద కాలువ నీటి ఆధారంగా తొమ్మిది తూంలను నిర్మించారు. వాటి ఆధారంగా నీటి సరఫరా జరిగే ఆయకట్టు 13 వేల ఎకరాలకు ప్రాజెక్ట్ నుంచి నీరు అందించాలి. కానీ ఈ సీజన్‌లో వరద కాలువ ఆయకట్టుకు నీటి విడుదలను పేర్కొనలేదు. వరద కాలువ నిర్మాణ సమయంలో ఎంతో మంది రైతులు భూములు కోల్పోయారు. వారి కోసం కాలువలో కిలోమీటర్‌కు ఒక కట్ట కట్టి నీటిని నిల్వ ఉంచాలని జీవో కూడా ఉంది. కానీ ఇప్పటి వరకు అలా చేయలేదు. అవసరమైతే ప్రాజెక్ట్ నుంచి విడుదల చేసి కాలువలో నీరు ఉంచాలని రైతులు కోరుతున్నారు.



వరద కాలువలో చేరిన వర్షపు నీరు

క్లుప్తంగా

రైల్వే బ్రిడ్జి వద్ద స్తంభించిన వాహనాలు



మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లిలో ఉన్న రైల్వే బ్రిడ్జివద్ద శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జి వద్ద పనులు కొనసాగుతున్న ప్రాంతంలో ఆర్మూర్ వైపు లోడుతో వెళ్తున్న లారీ సెంటర్ వీల్ విరిగి రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గం లేక సుమారు 5 కిలో మీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో లారీకి పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పరీక్ష ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని 2021–22 బీఈడ్ (బ్యాచ్‌లర్ ఆఫ్ ఎడ్యుకేషన్) 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 13వరకు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 14 వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పరిహారం కోసం ఎదురు చూపు..



నవీపేట: మండలంలోని ఆశాజ్యోతి కాలనీలో ఈనెల 4న జరిగిన అగ్ని ప్రమాదంలో పాతర్ల తెనుగు భోజన్న నివాస గృహం దగ్ధమైంది. కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో సంభవించిన ఈ ప్రమాదంలో భోజన్నకు చెందిన వ్యవసాయ భూమి పాస్‌బుక్కులు, రూ. లక్షా ఇరవై వేల నగదు, బట్టలు, విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. 30 ఏళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ఆశామూర్తి 'వెట్టి విముక్తి పథకం' కింద బాండెడ్ లేబర్లకు ఇళ్లు కట్టి ఇచ్చారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డు పాలయ్యామని బాధితుడు ఆందోళన వ్యక్తం చేస్తునాడు. భార్య, ఇద్దరు కుమారుల పోషణ కష్టమైందని విలపిస్తున్నారు. పరిహారం కోసం ఎదురు చూస్తున్నామని, విచారణకు వచ్చిన అధికారులు సైతం ఎలాంటి పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

మోర్తాడ్ @ రేషన్ దందా

- రేషన్ దుకాణాల వద్దే కాపుకాస్తున్న వ్యాపారులు
- కిలో రూ.16కు కొనుగోలు చేసి రూ.20కి విక్రయిస్తున్న దళారులు





మోర్తాడ్‌లో నిలువ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు(ఫైల్)

మోర్తాడ్: మండల కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ దందా కొనసాగుతోంది. నాలుగు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ అధికారులు ఓ గోదాంపై దాడి చేసి 130 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో మోర్తాడ్ అక్రమ దందాకు కేంద్ర బిందువుగా మారిందని చెప్పొచ్చు. గతంలోను టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి అక్రమ బియ్యం దందాను కట్టడి చేయాలని ప్రయత్నించారు. కానీ దళారులు మాత్రం ఈ దందాను కొనసాగిస్తూనే ఉన్నారు. రేషన్ దుకాణాల నుంచి బియ్యాన్ని వినియోగదారులు ఇంటికి తీసుకెళ్లక ముందే అక్కడే కాపు కాసి ఉంటున్న వ్యాపారులే బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కిలో బియ్యం రూ.16కు కొనుగోలు చేస్తుండగా బహిరంగ మార్కెట్‌లో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. చిన్న చిన్న వ్యాపారులు బియ్యం సేకరిస్తుండగా వీరి నుంచి బడా వ్యాపారులు టోకున బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కొందరు దళారులైతే బియ్యం కొనుగోలు కోసం కూలీలను నియమించుకున్నారు. వారు బియ్యం సేకరిస్తే ఎంతో కొంత కమీషన్ లేదా జీతం ఇచ్చి సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రతో పాటు, బీరు ఫ్యాక్టరీలు, రైస్ మిల్లర్లకే విక్రయిస్తున్నట్లు సమాచారం. మండలంలో ఇప్పటికే డీసీఎంలు, వ్యాన్లు బియ్యంతో పట్టుబడ్డాయి. అయినా వారు అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. అధికారులు నిఘా పెంచి బియ్యం అక్రమంగా నిలువ ఉంచేవారిపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆలయాలే టార్గెట్

- రుద్రూర్‌లో వరుస చోరీలతో రెచ్చిపోతున్న దొంగలు
- పట్టించుకోని పోలీసులు



వీరభద్ర స్వామి ఆలయంలో దుండగులు పగలగొట్టిన హుండీ(ఫైల్)

రుద్రూర్: మండల కేంద్రంలో దొంగలు రోజు రోజుకు రెచ్చిపోతున్నారు. ఆలయాల్లో వరుసగా దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ మందిరం, శ్రీ వీరభద్ర స్వామి ఆలయం, శ్రీ చౌడేశ్వరి దేవి మందిరం, శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయాల్లో చోరీకి పాల్పడ్డ ఘటనలు ఉన్నాయి. శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి హుండీ పగలగొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లిన దొంగలు తాజాగా శుక్రవారం రాత్రి అంగడి బజార్‌లోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. గేటు దూకి లోపలికి వెళ్లిన దొంగలు ఆలయంలో ఉన్న హారతి పళ్లెం, వెండి గంగాళం, బకెట్ ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ. 8వేల వరకు ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు. శ్రీ వీరభద్ర ఆలయంలో 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు దొంగలు హుండీ పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ గుడిలో ఏడాదిలో నాలుగు సార్లు దొంగతనం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. వీరభద్ర ఆలయంలో చోరీలను అరికట్టేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే దొంగలు వాటి వైర్లను కట్ చేసి చోరీకి పాల్పడ్డారు. అలాగే గతంలో మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి ఆలయంలో, శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడగా భక్తులు వారిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. అంతకుముందు హనుమాన్ మందిరంలో నాలుగు సార్లు దొంగతనం జరిగింది. రాత్రివేళ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ఆలయాలపై దృష్టి సారించాలని, అర్ధరాత్రి ఆలయ పరిసర ప్రాంతాలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఆహార కల్తీపై రాష్ట్రవ్యాప్తంగా సర్వే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిళా సంక్షేమ అధికారి రసూల్ బీ, సంక్షేమ సమితి సభ్యులు

సుభాష్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీపై వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా సర్వే చేపట్టనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. ఈమేరకు శుక్రవారం 'ఆహార కల్తీ లేని నిజామాబాద్' పేరుతో ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆహార కల్తీపై సర్వే–వినియోగదారుల చైతన్యం కార్యక్రమాలను ప్రారంభించారు. ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టడానికి ఆహార కల్తీ నిరోధక శాఖ, లీగల్ మెట్రాలజీ, పౌరసరఫరాల శాఖ, స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ విధులు నిర్వర్తించడంతోపాటు సంపూర్ణ పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీలు క్రియాశీలక పాత్ర వహిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ సేవలపై చైతన్యవంతులను చేస్తూ, హానికరమైన ఆహార కల్తీని అరికట్టడానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి సర్వే ప్రారంభించామన్నారు. అనంతరం సర్వేకు సంబంధించిన పోస్టర్లను మహిళా సంక్షేమ అధికారి రసూల్ బీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మ, సందు ప్రవీణ్, మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, గడప రవికుమార్ పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి యూనియన్ బ్యాంక్ మేనేజర్

ఖలీల్‌వాడి: ఖాతాదారులను మోసగించి అరెస్టయి రిమాండ్‌లో ఉన్న నగరంలోని పెద్దబజార్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్‌ను పోలీస్ కస్టడీలోకి తీసుకున్నారు. మూడు రోజుల కస్టడీకి కోర్టు శుక్రవారం అనుమతిచ్చింది. అజయ్ ఖాతాదారుల నుంచి సుమారు రూ.4 కోట్లు టోకరా వేసిన విషయం తెలిసిందే.

ఆర్టీసీ 'లక్కీ' మహిళల ఎంపిక



ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్‌లో ప్రవేశ పెట్టిన డీలక్స్ బస్సులలో ప్రయాణించే మహిళలకు గిఫ్ట్ స్కీం ప్రవేశ పెట్టినట్లు నిజామాబాద్ డిపో–1 మేనేజర్ ఆనంద్ తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గిఫ్ట్ బాక్సు నుంచి డ్రా తీసి ముగ్గురు మహిళలకు బహుమతులు అందజేస్తామన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో జూలై 15 నుంచి 31 వరకు ప్రయాణించిన ముగ్గురు మహిళలను డ్రా ద్వారా ఎంపిక చేశారు. మొదటి బహుమతి విజయలక్ష్మి(పెద్దపల్లి), రెండో బహుమతి సౌజన్య(ఆర్మూర్), మూడో బహుమతి వసంత (కమ్మర్‌పల్లి) ఎంపికయ్యారు. వీరికి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ద్వారా బహుమతలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్, స్టేషన్ మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

నిజామాబాద్ రూరల్: ధర్మారం గ్రామానికి చెందిన పోశం గంగ ముత్యం కూతురు కీర్తన ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో వైద్యం కోసం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సంప్రదించారు. దీంతో ఆయన బాధిత కుటుంబానికి రూ.లక్ష 20 వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలకు సమన్యాయం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

- ఆత్మహత్య చేసుకున్న రాజేశ్ అంత్యక్రియల్లో నిరసన



రాజేశ్ (ఫైల్)



అంతిమయాత్రలో నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

జక్రాన్‌పల్లి: అక్రమ వడ్డీ వసూలు చేస్తూ రైతుల ఆత్మహత్యకు కారణమవుతున్న వ్యాపారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని అర్గుల్‌కు చెందిన కుంట రాజేశ్(45)అనే రైతు అప్పుల బాధతో ఉరేసుకొని గురువారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొని నిరసన తెలిపారు. మృతుడు రాజేశ్‌కు వడ్డీ వ్యాపారులు నిత్యం ఫోన్ చేస్తూ నగదు కట్టాలని లేకుంటే ఇంటికి వచ్చి గొడవ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని, కొంత సమయం కావాలని అతను కోరినా వారు వినకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. చివరికి పోలీసుల బందోబస్తు మధ్య రాజేశ్ అంత్యక్రియలు జరిగాయి. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

ఖలీల్‌వాడి: మతిస్థిమితం లేని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన రాణిదేవి(30) కుటుంబంతో కలిసి నగరంలోని న్యూగంజ్‌లో గత 15 ఏళ్లుగా నివాసం ఉంటోంది.

కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక తరచూ అనారోగ్యానికి గురవుతోంది. గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త శ్రీచందన్ దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

40 మంది ఎస్సైల బదిలీ



ఖలీల్‌వాడి: శాసనసభ ఎన్నికల సందర్భంగా లాంగ్‌స్టాండింగ్‌లో ఉన్న ఎస్సైల బదిలీలు ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు చేపట్టారు. ఎన్నికల తర్వాత బదిలీలు జరుగుతాయని భావించినా ఎంపీ ఎన్నికల నేపథ్యంలో బ్రేక్ పడింది. శుక్రవారం బాసర జోన్ పరిధిలోని నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 40 మంది ఎస్సైల బదిలీలు జరిగాయి. నిజామాబాద్ రెండో టౌన్ ఎస్సైగా ఎండీ యాసిర్ అరాఫత్, సిరికొండ ఎస్సైగా ఎల్ రామ్, నిజామాబాద్ సీసీఎస్ ఎస్సైగా రమేశ్, నిజామాబాద్ నాలుగో టౌన్ ఎస్సైగా శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్సై–1గా సంజీవ్, ఐదో టౌన్ ఎస్సైగా వెంకట్రావు, మోపాల్ ఎస్సైగా యాదగిరి, నవీపేట్ ఎస్సైగా వినయ్‌కుమార్, వేల్పూర్ ఎస్సైగా నాగనాథ్, బోధన్ రూరల్ ఎస్సైగా రాజశేఖర్, కమ్మర్‌పల్లి ఎస్సైగా అనిల్‌రెడ్డి, నందిపేట్ ఎస్సైగా హరిబాబు, భీంగల్ ఎస్సైగా మహేశ్, నిజామాబాద్ రూరల్ ఎస్సైగా మహ్మద్ ఆరిఫ్, ఆర్మూర్ ఎస్సై–1గా గంగాధర్, మహిళా పీఎస్ ఎస్సై–1గా సంజీవ్‌రావు, నిజామాబాద్ ఒకటో టౌన్ ఎస్సై–1గా విక్రం, ధర్పల్లి ఎస్సైగా రామకృష్ణ, మెండోరా ఎస్సైగా నారాయణ, బోధన్ టౌన్–2 ఎస్సైగా హబీబ్‌ఖాన్, నిజామాబాద్‌రూరల్ ఎస్సై–2గా బాపురావు, నిజామాబాద్ త్రీటౌన్ ఎస్సై–2గా నర్సయ్య, నిజామాబాద్ ఐదోటౌన్ ఎస్సై–2గా లక్ష్మణ్, డిచ్‌పల్లి ఎస్సై–2గా సత్యం, నిజామాబాద్ ఐదవటౌన్ ఎస్సై–2గా ఉదయ్ కుమార్, నిజామాబాద్ సీసీఎస్ ఎస్సై–2గా విఠల్ రావు, నిజామాబాద్ సీసీఆర్‌బీ ఎస్సైగా దేవకుమార్, నిజామాబాద్ ఎస్సై–2గా హన్మాండ్లు, నిజామాబాద్ సీసీఎస్ ఎస్సైగా చంద్రమోహన్, మోపాల్ ఎస్సై–2గా రజినీకాంత్, నిర్మల్ జిల్లా కుంటాల ఎస్సైగా భాస్కర్‌చారి, నిర్మల్ జిల్లా బజార్‌హత్నూర్ ఎస్సైగా అప్పారావు, ఏర్గట్ల ఎస్సైగా రాము, బోధన్ ఎస్సై–1గా మచ్చేందర్, బాల్కొండ ఎస్సైగా నరేశ్, నిజామాబాద్ ఒకటో టౌన్ ఎస్సై–2గా మహమ్మద్ షరీఫ్, నిజామాబాద్ త్రీటౌన్ ఎస్సై–1గా ఉడుత మహేశ్ బదిలీ కాగా రామరావు, పాండేరావులను నిజామాబాద్ వీఆర్‌కు పంపించారు.

న్యూఢిల్లీ స్వాతంత్య్ర వేడుకలకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



తెయూ(డిచ్‌పల్లి): న్యూఢిల్లీలో ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలలో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు రావడం తెలంగాణ యూనివర్సిటీకి గర్వకారణమని రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. తెయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కె విజయశాంతి, ఏ జ్యోతి (తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజ్, కామారెడ్డి), శివప్రసాద్, సాయిరాం (జీజీ కాలేజ్, నిజామాబాద్)కు ఈ అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఎంపికైన వలంటీర్లను శుక్రవారం తన చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త కొండరవీందర్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి చంద్రకళ, జూనియర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఖిల్లా రోడ్డు చౌరస్తాలో గంజాయి సరఫరా చేస్తున్న షేక్ అబ్దుల్ సమద్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో దిలీప్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఖిల్లా చౌరస్తా వద్ద సమద్‌ను శుక్రవారం పట్టుకోగా అతని నుంచి 455 గ్రాముల ఎండు గంజాయి, టీవీఎస్ ఎక్స్‌సెల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తనిఖీలో ఎస్సై మల్లేశ్, సిబ్బంది షబీరుద్దీన్, ప్రభాకర్, సంజయ్, ధంసింగ్ పాల్గొన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు రవాణా, అమ్మకాలు చేపడితే 8712658973 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌వో కోరారు.

క్రైం కార్నర్

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

బాల్కొండ: ఆర్మూర్ మండలం కోటార్మూర్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబ తగాదాలతో ఎస్సారెస్పీలోకి ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చాడని ఫోన్‌లో సమాచారం అందుకున్న ముప్కాల్ పోలీసులు వెంటనే స్పందించి ఆయనను కాపాడారు. ముప్కాల్ మండల పరిధిలోకి వచ్చే లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద పట్టుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని.. క్షణికావేశంలో బలవన్మరణం చేసుకోవద్దని ఎస్సై భాస్కరాచారి పేర్కొన్నారు.

చెట్ల పొదల్లో కొండ చిలువ



నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం చెట్ల పొదలను తొలగిస్తుండగా భారీ కొండ చిలువ లభ్యమైంది. పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని చెట్ల పొదలను శుక్రవారం జేసీబీతో తొలగిస్తుండగా 12 అడుగుల కొండ చిలువ కనిపించింది. దీంతో దానికి కొద్ది భాగం గాయమవగా ఫారెస్ట్ అధికారులకు స్థానికులు సమాచారమిచ్చారు.

చెరువులో మృతదేహం లభ్యం

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత పాతంగల్ చెరువులో గ్రామానికి చెందిన గోవూర్ గంగవ్వ (65)వృద్ధురాలి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని వెలికితీయించారు. మతిస్థిమితం లేని గంగవ్వ కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ పేర్కొన్నారు.

ఘర్షణ కేసులో ఇద్దరి రిమాండ్

కామారెడ్డి క్రైం: అన్నదమ్ముల కుటుంబాల మధ్య గతంలో జరిగిన ఓ ఘర్షణ కేసులో ఇద్దరి నిందితులకు కామారెడ్డి కోర్టు శుక్రవారం రిమాండ్ విధించింది. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రావు, ప్రవీణ్‌రావు 2019లో జరిగిన ఓ గొడవలో ఇద్దరిపై దాడి చేశారు. ఈ కేసు కోర్టులో కొనసాగుతోంది. నిందితులుగా ఉన్న ఇద్దరిని కోర్టు ఆదేశాల మేరకు దేవునిపల్లి పోలీసులు శుక్రవారం కోర్టుకు హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

బాన్సువాడ రూరల్: ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన మండలంలోని బుడిమి రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడలో గురువారం వారాంతపు సంత కావడంతో దెగ్లూర్ నుంచి అబ్దుల్ హజీజ్(47), షేక్ రఫీఖ్ కలిసి ఆటోలో పండ్ల వ్యాపారం కోసం వచ్చారు. రాత్రి వ్యాపారం ముగించుకొని ఆటోలో బయలుదేరుతుండగా బుడిమి రోడ్డు సమీపంలో వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ వేగంగా ఆటోను ఢీకొన్నది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడగా అబ్దుల్ హజీజ్ అక్కడికక్కడే మృతి చెందగా రఫీఖ్‌కు గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు షేక్ ఆరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కడుపు నొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

బీబీపేట: కడుపు నొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంపరి భూదయ్య(60) వృత్తి రీత్యా కుల వృత్తి చేస్తున్నాడు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను బీబీపేట శివారులోని రాంరెడ్డిపల్లి రోడ్డులో పురుగుల మందు తాగాడు. అదే రోడ్డు గుండా వెళ్తున్న గ్రామానికి చెందిన నరేశ్ ఈ విషయాన్ని గమనించి కుటుంబీకులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబీకులు అక్కడికి చేరుకొని భూదయ్యను సిద్దిపేటకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. వారం రోజులుగా కడుపు నొప్పితో బాధపడడంతో పాటు మానసికస్థితి బాగాలేదన్న కోడలు లక్ష్మీప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రైవర్‌పై దాడి

- ఇన్నోవా వాహనం ఎత్తుకెళ్లిన దుండగులు

లింగంపేట: డ్రైవర్‌పై దాడి చేసి ఇన్నోవా వాహన, రెండు సెల్‌ఫోన్‌లను దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గూడవల్లి స్టీవెన్ ఇన్నోవా వాహనం లీజుకు తీసుకొని హైదరాబాద్‌లో కిరాయి నడుపుతూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి లింగంపేట మండలం కన్నాపూర్‌కు చెందిన దారవోయిన శ్రీకాంత్ అతని భార్య, కుమారుడు కలిసి హైదరాబాద్‌లో స్టీవెన్ నడుపుతున్న ఇన్నోవా వాహనాన్ని కిరాయికి మాట్లాడుకొని లింగంపేట మండలం కన్నాపూర్‌కు వస్తున్నారు. రాత్రి ఒంటిగంటకు కన్నాపూర్ సమీపంలోకి వచ్చిన తర్వాత అటవీ ప్రాంతంలో కాలకృత్యాల కోసం వాహనాన్ని ఆపమని చెప్పగా డ్రైవర్ స్టీవెన్ వాహనాన్ని పక్కన నిలిపివేశాడు. శ్రీకాంత్ అతని భార్య ఇద్దరు కలిసి డ్రైవర్‌పై దాడి చేసి చున్నీతో మెడకు బిగించి చంపడానికి యత్నించారు.

దీంతో డ్రైవర్ స్పృహతప్పి పడిపోయాడు. అతని దగ్గర ఉన్న రెండు సెల్‌ఫోన్లు, ఇన్నోవా కారును తీసుకొని పారిపోయారు. డ్రైవర్ స్పృహ నుంచి కోలుకొని శుక్రవారం లింగంపేట పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలో జారిపడి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో జారిపడి ఒ కరు మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం కొటాల్‌పల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేటకు చెందిన గడ్డమీది సత్తయ్య(58) గురువారం పొందుర్తిలో ఉండే తన చెల్లెలు ఇంటికి వెళ్లి వస్తానని కాలినడకన బయలు దేరాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా పొందుర్తికి రాలేదని చెప్పారు. దీంతో అతడి ఆచూకీ కోసం పలుచోట్ల గాలించారు. శుక్రవారం ఉదయం కొటాల్‌పల్లి వద్ద ఉన్న బావిలో మృతదేహం ఉందని సమాచారం రావడంతో వెళ్లి చూశారు. మృతుడిని సత్తయ్యగా గుర్తించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బోధన్‌టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో ఉన్న డాల్ఫిన్ హోటల్ వద్ద ఇరువర్గాలు ఒకరిపై ఒకరు శుక్రవారం దాడులు చేసుకున్నాయి. ఈ దాడిలో ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాకాసీపేట్‌కు చెందిన అన్సార్ అలీని శక్కర్‌నగర్‌కు చెందిన కౌన్సిలర్లు మీర్ నజీర్ అలీ, ఇమ్రాన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట తమపై ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నావంటు ప్రశ్నించారు. దీంతో వారి మధ్య మాటా మాటా పెరిగి వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కౌన్సిలర్లు అన్సార్ అలీపై దాడి చేశారు. వీరు శక్కర్‌నగర్ చౌరస్తాలోని డాల్ఫిన్ హోటల్‌లో ఉండగా అన్సార్ తన సోదరులు, స్నేహితులతో వచ్చి మీర్‌నజీర్, ఇమ్రాన్‌లపై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలకు చెందిన ఇమ్రాన్, మీర్‌నజీర్ అలీ, అన్సార్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వీరయ్య పేర్కొన్నారు.